సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం । 8 । జూన్ । 2024



ఇంకెన్నాళ్లీ అవస్థలు
ముక్కిడిగుండం-నార్లాపూర్ మార్గంలో పెద్దవాగు పారితే రాకపోకలు నిలుస్తున్నాయి.
వివరాలు 8లో ▸



క్రీడల్లో శిక్షణ ఎలా?
పాలమూరు స్టేడియంలో కోచ్‌ల కొరతతో క్రీడాకారులు అవస్థలు పడుతున్నారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.2 /24.4

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పిల్లల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పాలమూరు: అనాథ శరణాలయంలో పిల్లల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో ఉన్న రెడ్‌క్రాస్ అనాథ శరణాలయాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా పిల్లలకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. అనాథ శరణాలయంలో రెడ్‌క్రాస్ మంచి సౌకర్యాలు కల్పిస్తుందని.. ఇంట్లో వాతావరణం మాదిరిగానే ఇక్కడ ఉండటం సంతోషకరమని అన్నారు. అనంతరం బాల్యవివాహాలు, బాలల విద్య, హక్కులు, లీగల్ సర్వీస్ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'కార్పొరేట్' ప్రవేశాలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా వివిధ ప్రైవేటు కార్పొరేట్ కళాశాలల్లో విద్య అభ్యసించేందుకు ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలో ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం కలెక్టర్ రవి నాయక్ ప్రవేశ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు ఇటువంటి స్కీంలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ఎంపికైన విద్యార్థులు ఉచిత ఎంసెట్ శిక్షణతో కూడిన ఇంటర్ విద్య పొందుతారని తెలిపారు. మొదటి దశలో ఎస్సీలకు 19, బీసీ 15, మైనార్టీ 1, ఎస్టీ 11, దివ్యాంగులకు 2 సీట్లు కేటాయించినట్లు వివరించారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి పాండు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో బదిలీల ప్రక్రియ ప్రారంభం

నారాయణపేట రూరల్: ఎన్నికల కోడ్ పూర్తికావడంతో ఆర్టీసీలో ఉద్యోగుల స్థానచలనం ప్రారంభమైంది. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు డిపోల్లో విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లను బదిలీ చేస్తూ రీజనల్ మేనేజర్ శ్రీదేవి ఆదేశాలతో శుక్రవారం పీఓ ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణపేట 5, గద్వాల 3, నాగర్‌కర్నూల్ 2, కోస్గి, వనపర్తి, కల్వకుర్తి, షాద్‌నగర్ డిపోల నుంచి ఒక్కొక్కరు చొప్పున 14మంది డ్రైవర్లు, నారాయణపేట 4, గద్వాల 3, కల్వకుర్తి 2, కొల్లాపూర్ 2, షాద్‌నగర్, వనపర్తి నుంచి ఒకరు చొప్పున 13మంది కండక్టర్లను ఇతర డిపోలకు కేటాయించారు. త్వరలో సూపర్‌వైజర్లు, యూనిట్ ఆఫీసర్ల బదిలీలు ఉంటాయని ఆర్టీసీలో చర్చ జరుగుతుంది.

అమాత్యగిరిపై ఆశలు

కేంద్ర మంత్రివర్గంలో డీకే అరుణకు చోటు?



గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ నాలుగు స్థానాల్లో (సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్) గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గంలో కిషన్‌రెడ్డికి బెర్త్ లభించింది. తాజాగా ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా పుంజుకుని ఎనిమిది స్థానాల్లో (మహబూబ్‌నగర్, సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, మెదక్) విజయం సాధించింది. ఈ మేరకు ఇద్దరికి లేదా ముగ్గురికి మంత్రి పదవులు దక్కవచ్చనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఒకరికి కీలక మంత్రిత్వ శాఖతో పాటు మరో ఇద్దరికి సహాయ మంత్రులుగా అవకాశం కల్పించనున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు మహిళా కోటాలో సీనియర్ నాయకురాలైన డీకే అరుణకు మోదీ కేబినెట్‌లో మంత్రిగా బెర్త్ దక్కే చాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

మహిళా కోటాలో దక్కే అవకాశం

- పాలమూరు వాసుల్లో జోరుగా చర్చ
- సుదీర్ఘ రాజకీయ నేపథ్యమున్న కుటుంబం..
- ఐదేళ్లపాటు రాష్ట్ర మంత్రిగా పనిచేసిన అనుభవం
- సీఎం రేవంత్, కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కొనే నాయకురాలిగా గుర్తింపు
- ఇవన్నీ కలిసొస్తాయని రాజకీయ వర్గాల విశ్లేషణ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వం వహిస్తున్న ఎన్‌డీఏ కూటమి విజయం సాధించగా.. కేబినెట్ కూర్పులో తెలంగాణ నుంచి ఎవరెవరికి బెర్తులు దక్కనున్నాయనే అంశం రాష్ట్రవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది. ప్రధానంగా మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా గెలుపొందిన సీనియర్ నాయకురాలు, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు కేంద్ర మంత్రి వర్గంలో చోటుపై ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. సుదీర్ఘ రాజకీయ కుటుంబ నేపథ్యంతో పాటు సుమారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల పాటు రాష్ట్ర మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న ఆమెకు కేంద్ర మంత్రి పదవి ఖాయమనే అభిప్రాయం ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను, సీఎం రేవంత్‌రెడ్డిని దీటుగా ఎదుర్కొనే సామర్థ్యం ఉన్న నాయకురాలిగా గుర్తింపు పొందడం వంటి అంశాలు కలిసివస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సుదీర్ఘ రాజకీయ అనుభవం..

డీకే అరుణ పుట్టినిల్లు, మెట్టినిల్లు రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలే. తండ్రి చిట్టెం నర్సిరెడ్డి, మామ డీకే సత్యారెడ్డి ఎమ్మెల్యేలుగా ప్రజలకు సేవలందించారు. భర్త డీకే భరత్‌సింహారెడ్డి కూడా ఎమ్మెల్యేగా పనిచేశారు. అదేవిధంగా భరత్‌సింహారెడ్డి అన్న డీకే సమరసింహారెడ్డి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో పాటు మంత్రిగా పనిచేశారు.1996లో రాజకీయాల్లోకి వచ్చిన డీకే అరుణ మహబూబ్‌నగర్ ఎంపీగా, ఆ తర్వాత గద్వాల ఎమ్మెల్యేగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. అనంతరం కొల్లాపూర్ నియోజకవర్గంలోని పాన్‌గల్ నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసి తొలి విజయాన్ని అందుకున్నారు. 2004లో సమాజ్‌వాది పార్టీ నుంచి గద్వాల ఎమ్మెల్యేగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడిపై భారీ విజయం సాధించారు. 2009, 2014లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. 2009లో వైఎస్ కేబినెట్‌లో, ఆ తర్వాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతిలో ఓటమి చెందారు. మారిన రాజకీయ పరిణామాల క్రమంలో 2019లో బీజేపీలో చేరిన డీకే అరుణ అదే సంవత్సరంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చెందారు. తాజాగా ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందారు.

పాలమూరు నుంచే భవిష్యత్‌కు బాట..!

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలుగా ఉన్న డీకే అరుణ మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని సమర్థంగా ఢీకొని ఉత్కంఠ పోరులో విజయం సాధించారు. ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందిన వారే కాగా.. వారందరూ చల్లా గెలుపు కోసం క్రియాశీలకంగా పనిచేశారు. మరోవైపు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరులోని పలు ప్రాంతాల్లో 11 పర్యాయాలు పర్యటించారు. అయినా డీకే అరుణ విజయాన్ని అడ్డుకోలేకపోయారు. పలు మండలాల్లో బీజేపీ కేడర్ బలహీనంగా ఉన్నా.. అన్నింటినీ అధిగమించి డీకే అరుణ విజయకేతనం ఎగురవేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ అగ్రనాయకత్వం ముందుకుసాగుతోంది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ పదవులు కేటాయించే అవకాశం ఉంది. బీజేపీ తెలంగాణలో పాలమూరు నుంచే అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించిన విషయం తెలిసిందే. ఈ లెక్కన పాలమూరు నుంచే భవిష్యత్‌కు బాట సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంతో పాటు సీఎం రేవంత్, కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కొనే నాయకురాలిగా గుర్తింపు ఉన్న డీకే అరుణకు ఈ సారి కేంద్ర కేబినెట్‌లో బెర్త్ ఖాయమనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్, జిల్లా అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను ఆదివారం పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రవినాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటిఫికేషన్, రూట్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు అవసరమైన ఫర్నిచర్, వెలుతురు, ఫ్యాన్లు, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. జిల్లాకు వచ్చే పరీక్ష సామగ్రి, ప్రశ్నపత్రాలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూంలను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు జిరాక్స్ సెంటర్లను పూర్తి స్థాయిలో మూసివేయాలన్నారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ.. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్ష కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎటువంటి మాల్‌ప్రాక్టిస్ ఘటనలు చోటుచేసుకున్నా కలెక్టర్, టీజీపీఎస్సీకి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఏఎస్పీ రాములు మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు పోలీసు బందోబస్తు ఏర్పాటుతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రూట్‌కు ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సిబ్బంది ఉంటారన్నారు. స్ట్రాంగ్‌రూం నుంచి పరీక్ష సామగ్రి రవాణాకు ఎస్కార్ట్‌గా ఉంటారని తెలిపారు. సమావేశంలో టీజీపీఎస్సీ రీజినల్ కోఆర్డినేటర్లు నాగరాజు, సుజీవన్ ఉన్నారు.

డ్రైయినేజీ వ్యవస్థను సరిచేయండి




14వ వార్డులో మురుగును పరిశీలిస్తున్న చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 14వ వార్డు పరిధిలోని డబుల్‌బెడ్ రూం ఇళ్ల కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ (యూజీడీ) వ్యవస్థను సరిచేయాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆదేశించారు. కొన్ని నెలలుగా మాన్‌హోళ్లు నిండి మురుగు రోడ్లపైకి వస్తోందని కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డితో కలిసి అక్కడికి వెళ్లి పరిశీలించారు. కాగా, సుమారు 660 కుటుంబాలు నివాసం ఉంటున్నా.. కేవలం ఆరు ఇంచుల పైపులతో యూజీడీ ఏర్పాటు చేయడంతో ఎక్కడికక్కడ మ్యాన్‌హోళ్లు నిండిపోతున్నాయని కాలనీవాసులు వాపోయారు. దీనికి స్పందించిన ఆయన ప్రస్తుతానికి పారిశుద్ధ్య సిబ్బందితో మురుగును తొలగించాలని సూచించారు. ఇదిలాఉండగా, రెండేళ్ల క్రితం పూర్తయిన ఈ కాలనీని నిర్మించిన కాంట్రాక్టర్‌కు అప్పటి ప్రభుత్వం రూ.1.5 కోట్లు చెల్లించాల్సి ఉండటంతో మున్సిపాలిటీకి ఇంకా అప్పగించకపోవడం గమనార్హం. అంతకుముందు ఆరో వార్డు శ్రీనివాసకాలనీలోని (చిక్కుడువాగు) వరదకాల్వలో పూడికతీతను మున్సిపల్ చైర్మన్, కమిషనర్ పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు పటేల్ ప్రవీణ్‌కుమార్, ఎ.అంజయ్య, ఏఈ హరికృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల

- నేటినుంచి సీనియార్టీ జాబితా ప్రదర్శించనున్న విద్యాశాఖ అధికారులు
- గతంలో దరఖాస్తు చేసుకున్న 9,818 మంది ఉపాధ్యాయులు
- ఈ నెల 10, 11 తేదీల్లో అభ్యంతరాలకు అవకాశం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ క్రమంలో శని, ఆదివారాల్లో జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో సీనియార్టీ జాబితాలను ప్రదర్శించనున్నారు. జూన్ 10, 11వ తేదీల్లో సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలు చెప్పుకునే అవకాశం ఉంది. అనంతరం చివరి జాబితాలను 12వ తేదీన అధికారులు ప్రదర్శించనున్నారు. 13 నుంచి 16 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశంతో పాటు ఇదే తేదీల్లో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు కల్పించనున్నారు. ఈ ప్రక్రియ ఈనెల చివరి వరకు కొనసాగనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14,200 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా ఇందులో 9,818 మంది గతంలో బదిలీలు, పదోన్నతుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఈసారి దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది.

దోస్తు మొదటి దశ సీట్ల కేటాయింపు

- పీయూ పరిధిలో 92 కళాశాలల్లో 31 వేల సీట్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల్లో దోస్తు ద్వారా చేపడుతున్న అడ్మిషన్‌లకు సంబంధించి ప్రభుత్వం మొదటి దశ సీట్ల కేటాయింపు జరిగింది. ఇందులో పీయూ పరిధిలో మొత్తం 92 కళాశాలల్లో 31,300 సీట్లను భర్తీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో మొదటి విడతలో 4,499 సీట్లను కేటాయించారు. బీఏలో 1,003, బీకాంలో 1,227, బీఎస్సీలో 2,146, ఇతర గ్రూప్స్‌లో 123 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఎక్కువ ప్రభుత్వ కళాశాలలకు చెందిన సీట్లు ఉన్నాయి. ఇక మొదటి రోజు 507 మంది విద్యార్థులు కళాశాలలకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. మరో ఐదు రోజుల పాటు విద్యార్థులు కళాశాలల్లో చేరేందుకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

జీరో బిల్లు వచ్చేసింది..

అమల్లోకి గృహజ్యోతి పథకం

- ఎన్నికల కోడ్‌తో మూడునెలలు ఆలస్యం
- ఈనెల 6నుంచి జీరో బిల్లులు జారీ చేస్తున్న విద్యుత్ సిబ్బంది
- జిల్లాలో 2.65 లక్షల మందికి లబ్ధి



మీటరు రీడింగ్ తీస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగి (ఇన్‌సెట్‌లో) జీరో బిల్లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎట్టకేలకు గృహజ్యోతి పథకం (జీరో కరెంట్ బిల్లు) అమల్లోకి వచ్చింది. గత మార్చిలోనే గృహజ్యోతి పథకం అమలు కావాల్సి ఉండగా.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు మూడు నెలలపాటు విద్యుత్ బిల్లులు చెల్లిస్తూ వచ్చారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ఈనెల 4వ తేదీతో ముగియడంతో సంబంధిత అధికారులు గృహజ్యోతి పథకం కింద రెండు రోజుల నుంచి జీరో బిల్లులను జారీ చేస్తున్నారు. జిల్లాలో 2.65 లక్షల మందికి పైగా లబ్ధి చేకూరనుంది.

రీఫండ్ అయ్యేనా..?

గృహజ్యోతి పథకం అమలు నాటి నుంచి మే నెల వరకు ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారులు చెల్లించిన బిల్లుల రీఫండ్‌పై స్పష్టత కరువైంది. లబ్ధిదారులు చెల్లించిన మూడు నెలల బిల్లులను ఎలా రీఫండ్ చేస్తారో తెలియని పరిస్థితిలో విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారని తెలుస్తోంది.

గృహేతర ప్రయోజనాలకు వినియోగిస్తే చర్యలు..

గృహజ్యోతి పథకం కింద అందించే ఉచిత విద్యుత్‌ను గృహేతర ప్రయోజనాలకు వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో వెల్లడించింది. పథకంలో అర్హులైన వినియోగదారులు నిబంధనలను ఉల్లంఘిస్తే విద్యుత్ చట్టం –2003 ద్వారా తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

లబ్ధిదారులందరికీ జీరో కరెంట్ బిల్లు..



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల కోడ్ కారణంగా గృహజ్యోతి పథకం అమలు కాలేదు. ఎన్నికల కోడ్ ముగిసినందున ఈనెల నుంచి జీఓ విద్యుత్ బిల్లు పథకం అమలు చేస్తున్నాం. జిల్లాలో 2.65 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. – వెంకటరమేష్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ

నిధుల రికవరీ ఎప్పుడో?

రెండేళ్ల క్రితం స్త్రీనిధి రుణాలు పక్కదారి!

- సొంతానికి వాడుకున్న ఏడుగురు ఆర్‌పీలు
- రూ.34,51,911కు గాను రూ.14.66 లక్షలు రాక
- ఇంకా రూ.19,85,911 చెల్లించని వైనం
- బాధ్యులపై పోలీసు కేసు పెట్టినా ఫలితం దక్కలే



ఉమామహేశ్వరి ఎస్‌ఎల్‌ఎఫ్ సమావేశంలో స్త్రీనిధి రుణ బకాయిల రికవరీపై చర్చిస్తున్న మహిళలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్నేళ్లుగా పట్టణ పరిధిలోని మహిళా పొదుపు సంఘాల సభ్యులకు ఆర్థికంగా ఎదిగేందుకు మెప్మా ఆధ్వర్యంలో స్త్రీనిధి నుంచి అలాగే బ్యాంకు లింకేజీ కింద రుణాలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా స్త్రీనిధి నుంచి రూ.30 వేలు రుణం తీసుకుంటే 24 నెలలపాటు కిస్తులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రూ.50 వేలు తీసుకుంటే 42 నెలల పాటు, ఒకవేళ రూ.లక్ష తీసుకుంటే 60 నెలల పాటు కంతులు చెల్లించాలి. ఇంతవరకు బాగానే ఉన్నా.. రెండేళ్ల క్రితం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని కొందరు రిసోర్స్‌పర్సన్స్ (ఆర్‌పీలు) మాత్రం ఈ రుణాలను పక్కదారి పట్టించారు. తమ సొంత అవసరాలకు వాడుకుని గడువు లోపు తిరిగి స్త్రీనిధికి చెల్లించలేదు. ఈ విషయమై గత ఏడాది జనవరిలో నిర్వహించిన సామాజిక తనిఖీలో బయటపడింది.

డబ్బులు సొంతానికి వాడుకున్నది వీరే..

వాస్తవానికి 2021–22 ఆర్థిక సంవత్సరం వరకు ఈ రుణాల కిస్తులు అంతా మ్యానువల్‌గా జరిగేది. ప్రతినెలా ఒకరోజు సమాఖ్య సమావేశం నిర్వహించి రుణం తీసుకున్న మహిళలు తమ బకాయిలను ఆర్‌పీలకు చెల్లించేవారు. ఇదే అదునుగా భావించిన ఏడుగురు ఆర్‌పీలు ఈ డబ్బులను స్త్రీనిధి బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా దాటవేస్తూ వచ్చారు. వీరిలో సూర్యోదయ ఐక్య పరస్పర మహిళా సంఘం తరఫున అప్పటి ఆర్‌పీ ఎస్.ప్రశాంతి ఏకంగా రూ.6,84,911, దుర్గాబాయి మహిళా మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ థ్రిఫ్ట్, క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ (మ్యాక్) (వార్డు నం.7, 13) తరఫున ఆర్‌పీ శ్వేత రూ.నాలుగు లక్షలు, మోమిన్ మ్యాక్ ప్రైవేట్ లిమిటెడ్ (వార్డు నం.19) తరఫున ఆర్‌పీ మహేశ్వరి రూ.ఐదు లక్షలు, శ్రీఆంజనేయ మ్యాక్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున ఆర్‌పీ రెహాన రూ.4.30 లక్షలు, అంబాభవాని మహిళా మ్యాక్ ప్రైవేట్ లిమిటెడ్ (వార్డు నం.34) తరఫున ఆర్‌పీ స్వయంప్రభ రూ.5.57 లక్షలు, రవీంద్రనగర్ మ్యాక్ ప్రైవేట్ లిమిటెడ్ (వార్డు నం.44) తరఫున ఆర్‌పీ సరస్వతి రూ.ఐదు లక్షలు, వైఎస్‌ఆర్ మహిళా మ్యాక్ ప్రైవేట్ లిమిటెడ్ (వార్డు నం.2) తరఫున ఆర్‌పీ రూ.3.80 లక్షలు ఇలా మొత్తం రూ.34,51,911 సొంతంగా వాడుకున్నట్టు ఏడాదిన్నర క్రితం స్త్రీనిధి సామాజిక తనిఖీలో వెలుగు చూసింది.

ఐదుగురి నుంచే రికవరీ..

వీరిలో ఎస్.ప్రశాంతి, మహేశ్వరి ఇప్పటివరకు ఒక్క రూపాయైనా చెల్లించలేదు. ఇదిలాఉండగా ప్రశాంతి రెండేళ్ల క్రితమే పట్టణం విడిచి ఎటో వెళ్లి ఇంతవరకు తిరిగిరాలేదు. దీంతో ఆమెను పదవి నుంచి మెప్మా అధికారులు తొలగించారు. ఇక రెహాన నుంచి రూ.96 వేలు, స్వయంప్రభ నుంచి రూ.2.60 లక్షలు, సరస్వతి, దివ్యల నుంచి మాత్రం పూర్తిగా రికవరీ చేయగలిగారు. వీరందరికీ మొదట్లో స్త్రీనిధి అధికారులు డిమాండ్ నోటీసులు అందజేసినా స్పందించకపోవడంతో చివరికి పోలీసు కేసులు పెట్టారు. ఇక కేవలం రూ.2.30 లక్షలు తిరిగి చెల్లించిన శ్వేతపై మాత్రం ఎలాంటి కేసు పెట్టకపోవడం గమనార్హం. ఈమె మెప్మా సిబ్బందిలోని ఒకరికి బంధువు కావడంతో అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఈ బకాయిలను వెంటనే రికవరీ చేయాలంటూ రాష్ట్ర స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఎండీ జి.విద్యాసాగర్‌రెడ్డి గత నెల 17న మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌తో పాటు మెప్మా పీడీకి ఆదేశాలు జారీ చేశారు.

తప్పక రికవరీ చేస్తాం



పట్టణ పరిధిలోని మహిళా పొదుపు సంఘాలకు సంబంధించి రుణ వాయిదాలను బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా సొంతానికి వాడుకున్న ఆర్‌పీలపై ఈపాటికే మా లీగల్ టీం కేసులు పెట్టింది. దీంతో ఐదుగురు కొంత మొత్తం తిరిగి చెల్లించారు. మిగతా డబ్బులను సైతం ఎట్టి పరిస్థితుల లోనూ బాధ్యుల నుంచి రాబడతాం. ఒకవేళ స్పందించని వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. – శివప్రసాద్, రీజినల్ మేనేజర్, స్త్రీనిధి, మహబూబ్‌నగర్

మొక్కజొన్న @ 2,407

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం మొక్కజొన్న గరిష్టంగా రూ. 2,407, కనిష్టంగా రూ. 1,966 ధరలు పలికాయి. వేరుశనగ గరిష్టంగా రూ. 5,890, కనిష్టంగా రూ. 4,816, జొన్నలు గరిష్టంగా రూ. 4,277, కనిష్టంగా రూ. 4,027, ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం గరిష్టంగా రూ. 2,536, కనిష్టంగా రూ. 1,909, హంసధాన్యం రూ. 1,808, ఆముదాలు రూ. 5,628 ధరలు వచ్చాయి.

క్లుప్తంగా

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొడేరు: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కోడేరుకి చెందిన నల్లవెల్లి స్వామి(48) కొన్ని రోజులుగా మద్యం తాగుతూ గ్రామంలో తిరుగుతుండేవాడు. తండ్రి బాలయ్య, భార్య ఈశ్వరమ్మ మందలించడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిర్వహించినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవి తెలియజేశారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఊట్కూర్: చికిత్స పొందుతూ వివాహిత మృతిచెందిన సంఘటన మండలంలోని పులిమామిడిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నచింతకుంట మండలంలోని బండ్రపల్లికి చెందిన లక్ష్మి(30)ని 9 ఏళ్ల కిందట పులిమామిడికి చెందిన రవికి ఇచ్చి వివాహం చేశారు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఈ నెల 5 ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి సోదరుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వివరించారు.

బైక్ పైనుంచి కింద పడిన వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: బైక్ పైనుంచి కింద పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బొరాసిపల్లికి చెందిన శరవంద(45) ఈ నెల 3న జిల్లా కేంద్రానికి వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్నాడు. నాగనూలు శివారులో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పైనుంచి కింద పడటంతో
తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. సంఘటనకు సంబంధించి మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

గుర్రం దాడిలో బాలుడికి గాయాలు



మహమ్మదాబాద్: పొలం దగ్గరకు వెళ్లిన ఓ బాలుడిపై గుర్రం దాడిచేసి కరిచిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. మండలంలోని మొకర్లబాద్‌కు చెందిన అర్వగొల్ల కృష్ణయ్య కుమారుడు 12 ఏళ్ల గొల్ల అరవింద్‌పై గురువారం గుర్రం దాడి చేసి కరిచింది. దీంతో వెంటనే బాలుడిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇదే గుర్రం గతంలో కుల్కచర్ల మండలం ఘనాపూర్‌లో ఆరుగురిపై, పక్కనే ఉన్న చిన్నాయపల్లిలో కూడా పలువురిపై దాడి చేయడంతో అక్కడి నుంచి తరిమేశారు.

ఇంకెన్నాళ్లీ అవస్థలు



ముక్కిడిగుండం–నార్లాపూర్ మధ్యన రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

వర్షాలకు పొంగిపొర్లిన ముక్కిడిగుండం పెద్దవాగు

- నార్లాపూర్–ముక్కిడిగుండం మధ్య రాకపోకలు బంద్
- ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి
- బ్రిడ్జి కోసం రూ.9 కోట్ల నిధులు మంజూరు
- పనుల ప్రారంభంలో ఆలస్యం

కొల్లాపూర్: ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా నియోజకవర్గంలోని ముక్కిడిగుండం–నార్లాపూర్ మధ్యన ఉన్న పెద్దవాగు పొంగిపొర్లింది. ఆ రహదారి గుండా రాకపోకలు ఒక రోజంతా నిలిచిపోయాయి. వాగుపై బ్రిడ్జి నిర్మాణం ముందుకు సాగడం లేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు, పాలకులు శ్రద్ధ చూపడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

బ్రిడ్జి కోసం రూ.9 కోట్లు మంజూరు

నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో వాగులు ఉప్పొంగితే రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోయే పరిస్థితులు ఉండేవి. అయితే గత ప్రభుత్వ హయాంలో మండలంలోని నార్లాపూర్ చెంచుపెంట సమీపంలోని పెద్దవాగుపై, మొలచింతలపల్లి–ముక్కిడిగుండం మధ్యన ఉడుముల వాగుపై, చుక్కాయిపల్లి సమీపంలోని వాగుపై, పెంట్లవెల్లి మండలంలో మల్లేశ్వరం వెళ్లే దారిలో గల వాగుపై బ్రిడ్జిలు నిర్మించారు. అదే సమయంలో పంచాయితీ రాజ్ శాఖ ఎస్‌డీఎఫ్ ద్వారా ముక్కిడిగుండం–నార్లాపూర్ మధ్యన గల పెద్దవాగుపై కూడా బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.9 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులకు గత ఏడాది భూమి పూజ చేశారు. పనులు మాత్రం చేపట్టలేదు. ఇటీవలనే కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గుంతలు తవ్వారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ గుంతలు కూడా నీటిలో మునిగిపోయాయి.

ఉడుముల వాగుపై నుంచి రాకపోకలు

ముక్కిడిగుండం–మొలచింతలపల్లి మధ్యన గల ఉడుముల వాగుపై నిర్మించిన బ్రిడ్జి పనులు 90 శాతం మేరకు పూర్తయ్యాయి. బ్రిడ్జికి అప్రోచ్ రోడ్‌ను నిర్మించాల్సి ఉంది. ఈ బ్రిడ్జిని ఇంకా అధికారికంగా ప్రారంభించలేదు. పెద్దవాగు ఉప్పొంగడంతో ముక్కిడిగుండం, మొలచింతపల్లి మధ్యన ఉడుముల వాగు బ్రిడ్జిపైనుంచే రాకపోకలు కొనసాగుతున్నాయి.

దశాబ్దాల సమస్య..



మా గ్రామ సమీపంలోని పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించాలని దశాబ్దాలుగా పాలకులను, అధికారులను కోరుతున్నాం. వారు పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించి, టెండర్లు పూర్తిచేశారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– అశోక్, ముక్కిడిగుండం

మా గ్రామాన్ని పట్టించుకోండి..



పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం శిలాఫలకాలకే పరిమితం అవుతోంది. వాగు ఉప్పొంగితే రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. విద్యుత్ సమస్యలు ఎదురవుతాయి. గతంలో రోజుల తరబడి గ్రామం నుంచి బయటకు వచ్చేవాళ్లం కాదు. ఇప్పుడు ఉడుముల వాగు బ్రిడ్జి పైనుంచి చుట్టూ తిరిగి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాం. పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మిస్తే గ్రామస్తులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– మల్లేష్‌యాదవ్, ముక్కిడిగుండం

పనులు ప్రారంభమయ్యాయి..

నార్లాపూర్–ముక్కిడిగుండం మధ్యన ఉన్న పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. ఇటీవలనే పనులు కాంట్రాక్టర్ ప్రారంభించారు. వర్షాల కారణంగా ముందుకు సాగడంలేదు. పనులు వేగంగా జరిగేలా చూస్తాం. ఉడుముల వాగుపై నిర్మించిన బ్రిడ్జికి అప్రోచ్ పనులు కూడా త్వరగా చేపట్టేలా కాంట్రాక్టర్‌తో చర్చిస్తాం. – సాయిరాం, ఏఈ

మంటగలిసిన మానవత్వం

- అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని రోడ్డుపై వదిలేసిన కుమారుడు
- తెల్లవారుజామున కురిసిన వర్షానికి తీవ్ర అస్వస్థత
- నరకయాతన అనుభవించి చివరకు మృతి



మృతి చెందక ముందు ఫంక్షన్ హాల్ వద్ద శ్రీహరి

కల్వకుర్తి టౌన్: ఆస్తి కోసం అనారోగ్యం బారిన పడిన ఓ వృద్ధ తండ్రిని కన్నవారే రోడ్డుపై వదిలేయగా.. నరకయాతన అనుభవించి మృతిచెందిన హృదయ విదారక ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని బలరాంనగర్‌కాలనీకి చెందిన శ్రీహరి (65)కి భార్య, కుమారుడితో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు. శ్రీహరి కొంత కాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతుండేవాడు. మూడు, నాలుగు నెలలుగా సమస్య తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు పట్టణంలో ఉన్న ప్లాట్‌ను విక్రయించి డబ్బులివ్వాలంటూ వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. ఇందుకు అతను ఒప్పుకోకపోవడంతో చేసేది లేక గురువారం కుమారుడు సమీప బంధువుల సాయంతో ఆటోలో ఎక్కించుకొని కుర్మిద్ద రోడ్డులో ఉన్న సాయిబాలాజీ ఫంక్షన్ హాల్ వద్ద వదిలేసి వెళ్లారు. దీంతో అక్కడి స్థానికులు అతడి దయనీయ స్థితిని చూసి భోజనం అందించారు. రాత్రి అక్కడే ఉండగా.. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి తడిసి చలి తీవ్రత పెరగడం, అనారోగ్యం కారణంగా మృతిచెందాడు. శ్రీహరి తన దీనగాథను వివరించిన వీడియో సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొట్టింది. మృతదేహాన్ని పోలీసులు స్థానికుల సాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

- పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఘటన
- నిలిచిన ట్రాఫిక్



వీరన్న నాయుడు (ఫైల్)

అలంపూర్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. కోనేరుకి చెందిన వీరన్న నాయుడు(50) పని నిమిత్తం కర్నూల్‌కు బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా 44వ జాతీయరహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజ వద్ద అదే మార్గంలో వస్తున్న టీఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఉండవెల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. నేషనల్ హైవే అంబులెన్స్‌లో మృతదేహాన్ని అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న బస్సును, బైక్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కాగా వీరన్న నాయుడుకు భార్య లోకేశ్వరమ్మ, కుమారుడు పరుశురాముడు, కుమార్తె నాగమణి ఉన్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొట్టడంతో మరోవ్యక్తి..

బల్మూర్: ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మైలారం శివారులో చోటుచేసుకుంది. స్థానికులు, బల్మూర్ ఏఎస్‌ఐ రేణయ్య కథనం ప్రకారం.. మైలారంనకు చెందిన కటికర్ల చంద్రయ్య (45) గ్రామ శివారులోని అంబగిరికి వెళ్లే రోడ్డు మలుపు వద్ద నిలబడి ఉన్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన ట్రాక్టర్ అదుపు తప్పి చంద్రయ్యపైకి దూసుకొచ్చింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రయ్యకు భార్య అలివేలతో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ మూడావత్ సైదులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

ఆటో, కారు ఢీ.. 10 మందికి తీవ్ర గాయాలు



రేలింగ్‌పైకి ఎక్కిన ఆటో

భూత్పూర్: మండలంలోని శేరిపల్లి (బి) వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం కారు ఆటోను ఢీకొని 10 మందికి తీవ్రగాయాలైన ఘటన చోటుచేసుకుంది. తాటిపర్తి ఎంపీటీసీ పుల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన విద్యార్థులు రాకేష్, సావిత్రి, శ్రీనిధి, హర్షవర్ధన్, ఇమ్రాన్, సలోని, రాము, లక్ష్మణ్‌లు మహబూబ్‌నగర్‌లో పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాసి తాటిపర్తికి ఆటోలో తిరుగుప్రయాణం అయ్యారు. మార్గమధ్యలో భూత్పూర్‌లో గ్రామానికి చంద్రమ్మ విద్యార్థులు వెళ్తున్న ఆటో ఎక్కింది. శేరిపల్లి (బి) వద్ద జాతీయ రహదారిపై ఆటోను భూత్పూర్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఖాజాతో పాటు ఆటో ప్రయాణిస్తున్న వారు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇమ్రాన్ పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా ఆస్పత్రి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించినట్లు ఎంపీటీసీ తెలిపారు. ప్రమాదం విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

రైలుకింద పడి యువకుడి బలవన్మరణం

గద్వాల క్రైం: రైలు కింద పడి యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేటీదొడ్డి మండలం శ్రీరంగపూర్‌కి చెందిన అంజి(26) భార్య నాగమణితో గద్వాల పట్టణంలోని గంజిపేట కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల నుంచి భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. తీవ్ర మనస్తాపం చెందిన యువకుడు తెల్లవారుజామున పాతహౌసింగ్ బోర్డు సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువకుడు మృతిచెందిన విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.

కారు బోల్తా : ఇద్దరికి తీవ్ర గాయాలు

అమ్రాబాద్: కారు బోల్తాపడి ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లి సమీపంలో మద్దిమడుగు ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అచ్చంపేటకు చెందిన కౌసల్య షాపింగ్‌మాల్ యజమాని పులిజాల రమేష్, తన కుటుంబ సభ్యులతో శుక్రవారం ఉదయం మద్దిమడుగు ఆంజనేయస్వామి దర్శనం కోసం వెళ్లారు. తిరిగి వస్తుండగా అతివేగంతో ఉన్న కారు ప్రమాదవశాత్తు కుమ్మరోనిపల్లి సమీపంలోని రోడ్డు నుంచి కిందికి బోల్తాపడింది. ఈ ప్రమాదంలోరమేష్ కాలు విరగడంతో పాటు ఆయన తల్లికి కౌసల్యకు తీవ్రగాయాలయ్యా యి. మరో ఐదుమందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం వారితో వారిని 108లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లైసెన్స్ లేని మెడికల్ దుకాణం సీజ్



సీజ్ చేసిన మందులతో ఔషధ నియంత్రణశాఖ అధికారులు

- రూ.1.50 లక్షల విలువైన మందులు స్వాధీనం

పాలమూరు: ఎలాంటి లైసెన్స్ లేకుండా అక్రమంగా విక్రయాలు చేస్తున్న ఓ మెడికల్ దుకాణాన్ని అధికారులు సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. వివరాలు ఇలా.. ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్త చెరువు రోడ్‌లో నిర్వహిస్తున్న మెడికల్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి లైసెన్స్ లేకపోవడంతో సీజ్ చేశారు. రూ.1.50 లక్షల విలువ చేసే 61రకాల ట్యాబ్‌లెట్స్, యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. ఈ మేరకు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏడీ దినేష్‌కుమార్ వెల్లడించారు. తనిఖీల్లో డ్రగ్‌ఇన్స్‌పెక్టర్లు రజియా సుల్తానా, రవికిరణ్, రష్మి, రఫీ, క్రాంతి పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత



కల్వకుర్తిరూరల్: సారా తయారీ కోసం ఉపయోగించే నల్ల బెల్లం, పటికను తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున వాహనాలను కుర్మిద్ద క్రాస్ రోడ్డులో తనిఖీ చేస్తుండగా 12 సంచుల్లో 360 కేజీల బెల్లం, 40 కేజీల పట్టిక, 4 లీటర్ల సారా లభించినట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి అక్రమంగా వీటిని తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. కొత్తపల్లి తండాకు చెందిన రవి, వెంకటాపూర్‌తండాకు చెందిన జగన్‌నాయక్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

రేషన్ బియ్యం..

కల్వకుర్తిరూరల్: రెండు వాహనాలలో తరలిస్తున్న 27 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, పోలీసుల ఆధ్వర్యంలో తర్నికల్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా బల్మూరు మండలం నుంచి రేషన్ బియ్యం గ్రామస్తుల వద్ద కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు అమ్మేందుకు తరలిస్తుండగా కల్వకుర్తిలో పట్టుబడ్డారని ఎస్‌ఐ చెప్పారు. తుమ్మన్‌పేటకు చెందిన సయ్యద్‌బాషా, మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇంట్లో చోరీ.. బంగారం, నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి నగదు, బంగారం ఎత్తికెళ్లారని ఉండవెల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. చౌరస్తాలోని దయాకర్ అపార్ట్‌మెంట్‌లో జ్యోతి కుటుంబం నివాసం ఉంటోంది. కర్నూలులో బంధువు ఒకరు మృతి చెందడంతో గత నెల 31న ఇంటికి తాళం వేసి వెళ్లింది. ఈ నెల 3న వచ్చి ఇంటి పరిసరాలను చూసుకొని తిరిగి సాయంత్రం కర్నూలుకు వెళ్లిపోయింది. కార్యక్రమాలు ముగించుకొని గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి చేరుకుంది. తలుపునకు వేసిన తాళం లేకపోవడంతో లోనికి వెళ్లి చూసింది. లోపల లైట్లు వేసి, బీరువా తెరుచుకొని కనిపించింది. బీరువాలో దాచిన 7 తులాల బంగారం, రూ.26 వేల నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం క్లూస్ టీం ఇంటి పరిసరాలను పరిశీలించామని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పిడుగు పాటుకు ఐదు గేదెలు మృతి

నవాబుపేట: పాడి గేదెలను నమ్ముకొని జీవనం సాగిస్తున్న అన్నదాతను పిడుగు పాటు ఆగం చేసింది. శుక్రవారం కురిసిన వర్షంతో పాటు పిడుగులు పడటంతో మండల పరిధిలోని లింగన్నపల్లిలో ఓ రైతుకు చెందిన 5 పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. దీంతో రైతు బోరున విలపించాడు. లింగన్నపల్లికి చెందిన పాడి రైతు ఆలకుంట లాలు తన గేదెలను శుక్రవారం ఎప్పటి మాదిరిగానే గ్రామ సమీపంలోని తన వ్యవసాయ పొలంలోని మర్రిచెట్టు నీడన కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఇంటికి వచ్చిన కొద్ది సమయానికే మర్రి చెట్టుపై పిడుగు పడటంతో చెట్టుకింద ఉన్న 5 గేదెలు మృతిచెందాయి. దీంతో రైతు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించాడు. గేదెల విలువ దాదాపుగా రూ.7 లక్షలకు పైగానే ఉండటంతో గ్రామస్తులు సైతం రైతును ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ ద్వారా సమాచారం అందుకున్న పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి రైతును ఆదుకుంటామని, అధైర్యపడవద్దని రైతుకు ఫోన్‌లో భరోసా ఇచ్చారు.

విత్తన శుద్ధితోనే అధిక దిగుబడి

పాడి–పంట



అలంపూర్: ఆధునిక వ్యవసాయంలో నాణ్యమైన విత్తనం అధిక దిగుబడి సాధించడానికి దోహదపడుతాయి. పెరుగుతున్న విత్తన ధరలతో రైతు కుదేల్ అవుతున్నాడు. విత్తనాలను నిల్వ చేసుకోవడం, మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసుకోవడం వంటి సమస్యలతోపాటుగా పురుగు, తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవడం రైతుకు తలకు మించిన భారంగా నేకాక సమస్యగా మారింది. రైతులు విత్తన శుద్ధితో పంట సాగులో ఎదురయ్యే సమస్యలను కొంత వరకు అధికమించడానికి అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. విత్తన శుద్ధి చేయకపోతే తెగుళ్లు, పురుగులు నేల నుంచి ఆశించి మొక్కల సాంద్రతను, దిగుబడిని గణనీయంగా తగ్గించే ప్రమాదం ఉంది. ఖరీఫ్‌లో పంటసాగు చేస్తున్న రైతులకు విత్తన శుద్ధి వల కలిగే లాభాలను వ్యవసాయ శాఖ ఏడీఏ వివరించారు.

విత్తన శుద్ధితో లాభాలు

పంటసాగు చేస్తున్న రైతులు విత్తన శుద్ధి క్రమం తప్పకుండా చేయాల్సి ఉంటుంది. విత్తన శుద్ధితో మొలక శాతం పెరిగి సాంద్రత సిఫార్సు మేరకు ఉంటుంది. తొలి దశలో ఆశించే పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుతుంది. దీంతో మొక్క ఏపుగా పెరగడానికి అవకాశం ఉంది. చీడపీడల ఉధృతిని తగ్గించి తర్వాత దశలో ఆశించే రసం పీల్చు పురుగులు, వైరస్ తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవచ్చు. రైజోబియం వలన నత్రజని స్థిరీకరణ జరుగుతుందని సూచించారు. అంతేకాక వాతావరణ కాలుష్యం తగ్గి మిత్ర పురుగులు రక్షించబడతాయని వివరించారు.

వివిధ రకాల విత్తన శుద్ధి ఇలా..

విత్తన శుద్ధికి ఒక్కొక్క పంటకు ఒక విధానం ఉంటుంది. వాటిని గమనించి రైతులు జాగ్రత్తలు పాటిస్తే ఆశించిన ఫలితాలు ఉంటాయి. వాటిలో కొన్ని పంట విత్తన శుద్ధి.

వరి..

కిలో వరి విత్తనంలో ఒక గ్రామ్ కార్బెంజిమ్, లీటర్ నీటిలో కలిపిన ద్రావణంలో ఒక రోజు నానబెట్టాలి. ఒక రోజు మండె కట్టి నారు మడిలో చల్లడం వలన అగ్గి తెగులు, ఆకు మచ్చ, పోడ తెగుళ్లను అదుపు చేయవచ్చు.

మొక్కజొన్న..

కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్ కలిపి శుద్ధి చేస్తే ఎండు తెగులు, కాటక తెగులు, మచ్చ తెగుళ్లను అదుపు చేయవచ్చు.

వేరుశనగ..

కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్‌తో శుద్ధి చేస్తే తిక్కాకు, ఆకుమచ్చ, త్రుప్పు, కాంత కాళ్ల తెగుళ్ల వ్యాప్తిని అరికట్టవచ్చు.

పత్తి..

బ్యాక్టీరియా వల్ల నల్ల మచ్చ ఆశించే ప్రాంతాల్లో లీటర్ నీటిలో 100 మిల్లీ గ్రాముల వైసన్ లేదా ప్లాంటామైసీన్, గ్రామ్ బీలెట్రాన్స్ కలిపిన ద్రావణంలో శుద్ధి చేసిన విత్తనాలను 6–8 గంటలు నానబెట్టి ఆ తర్వాత ఆరబెట్టుకొని విత్తుకుంటే ప్రయోజనం ఉంటుంది.

మిరప..

మిరపలోని వైరస్ తెగుళ్ల నివారణకు లీటర్ నీటిలో 150 గ్రాముల ట్రై సోడియం, ఆర్థ పాస్పేట్‌ను కిలో మిరప విత్తనాన్ని 12 గంటలు నానబెట్టి తర్వాత చల్లటి నీటిలో కడిగి విత్తుకోవాలి. దీంతో మంచి దిగుబడి సాధించవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విత్తన శుద్ధిలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అప్పుడే పంటలను కాపాడుకుని అధిక దిగుబడి సాగించడానికి వీలుంటుంది. విత్తన శుద్ధికి సరైన మందులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. విత్తనంలో తేమ శాతం ఎక్కువగా ఉండకుండా జాగ్రత్త పడాలి. సరైన మోతాదు మందులు వాడాలి. విత్తనం పైపొర ఊడిపోకుండా చూసుకోవాలి. అయితే విత్తన శుద్ధి చేసిన విత్తనాలను పశువుల దాణాగా వాడకూడదని రైతులు గుర్తుంచుకోవాలి. ఇలా విత్తన సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాల్సి ఉంటుంది.

ముందస్తు జాగ్రత్తలు మంచిది

చీడపీడలు వ్యాప్తి చెందిన తర్వాత సస్య రక్షణ పద్ధతులు పాటించడం కన్న వాటిని ముందుగానే విత్తన శుద్ధితో అదుపు చేసుకోవాలి. దీని వలన పంట నాణ్యత పెరగడమే కాక అధిక దిగుబడి సాధించి ఆదాయం పొందవచ్చు

రెగ్జిన్ దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం: దేవుడి వద్ద పెట్టిన దీపం వల్ల దుకాణంలో మంటలు వ్యాప్తి చెందాయి. వివరాల్లోకి వెళ్తే మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తా సమీపంలో ఉన్న రెగ్జిన్ అండ్ రేడియం దుకాణదారుడు అవినాష్ శుక్రవారం ఉదయం దుకాణంలో పూజ చేసి దేవుడి వద్ద దీపం పెట్టాడు. మధ్యాహ్నం సమయంలో దుకాణం మూసి తినడానికి ఇంటికి వెళ్లాడు. ఈక్రమంలో దీపం వల్ల దుకాణంలో మంటలు ఏర్పడి లోపల ఉన్న రెగ్జిన్ మెటీరీయల్ పూర్తిగా దగ్ధం అయ్యింది. దుకాణం మూసి ఉండటం వల్ల మంటలు బయటకు రావడానికి సమయం పట్టింది. పక్క దుకాణదారులు అతనికి ఫోన్‌చేసి చెప్పడంతో వచ్చి దుకాణం తెరువగా అప్పటికే మంటలు పెరిగాయి. ఘటనా స్థలానికి ఫైర్ ఇంజిన్ చేరుకుని సిబ్బంది మంటలు అదుపు చేశారు. దాదాపు రూ.8లక్షల వరకు నష్టం వచ్చినట్లు బాధితుడు తెలిపాడు. ఘటనా స్థలాన్ని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కిశోర్ పరిశీలించారు.

కొత్త సీఎస్‌గా నీరబ్‌కుమార్ ప్రసాద్ బాధ్యతలు

ప్రస్తుత సీఎస్ జవహర్‌రెడ్డిని బదిలీ చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ప్రస్తుత సీఎస్ డా.కేఎస్ జవహర్‌రెడ్డిని బదిలీ చేస్తూ నీరబ్‌కుమార్‌ప్రసాద్‌ను సీఎస్‌గా నియమిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలిచ్చింది. రాష్ట్ర సచివాలయంలో సీఎస్ చాంబర్ టీటీడీ వేద పండితులు, విజయవాడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానాల వేద పండితుల దివ్య ఆశీస్సుల మధ్య నీరబ్ కుమార్ ప్రసాద్ సీఎస్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ సహచర కార్యదర్శులు, శాఖాధిపతులు, ఇతర అధికారులు, సిబ్బంది సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా పనిచేసి వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో సమర్థంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందంజలో నిలిపేందుకు సాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీఏడీ కార్యదర్శి సురేశ్ కుమార్, స్పెషల్ సీఎస్‌లు గోపాల కృష్ణ ద్వివేది, రజత్ భార్గవ, విజయానంద్, పీసీసీఎఫ్ వై.మధుసూదన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శులు కె.సునీత, ప్రవీణ్ ప్రకాశ్, ప్రద్యుమ్న, ఐటీ కార్యదర్శి కె.శశిధర్, సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్ తదితరులున్నారు.

ఓటమిపై విశ్లేషించుకుంటాం

ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిపై లోతైన విశ్లేషణ చేసుకుంటామని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..జగన్ పాలనలో ఐదేళ్లపాటు దేశంలో ఎక్కడా లేని విధంగా అద్భుతమైన సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. లోపం ఎక్కడ జరిగిందో సమీక్షించుకుంటామని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులేమిటో తెలుసుకుంటామని తెలిపారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేస్తున్నట్లు చెప్పారని, ఈవీఎంలలో ఏమైనా లోపాలున్నాయేమోనని అనుమానం వ్యక్తం చేశారు. జగన్‌ను ఏపీ ప్రజలు వద్దనుకోలేదని, ఆయన అహంకారంతో ఓడిపోయారనేది అవాస్తవమని చెప్పారు.

రాష్ట్రంలో కుప్పకూలిన రాజ్యాంగ వ్యవస్థలు

చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు

- టీడీపీ యథేచ్ఛ దాడులతో ఆటవిక పరిస్థితులు
- అధికార యంత్రాంగం మొత్తం నిర్వీర్యం అయిపోయింది
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉన్మాదంతో దాడులు
- పోటీ చేసిన అభ్యర్థులకు రక్షణే లేకుండా పోయింది
- గవర్నర్ జోక్యం చేసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్
- బాధితులకు వైఎస్సార్‌సీపీ తోడుగా నిలుస్తుందని భరోసా



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలిపోయాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు వచ్చిందని మండిపడ్డారు. టీడీపీ యథేచ్ఛ దాడులతో ఆటవిక పరిస్థితులు తలెత్తాయని, యంత్రాంగం మొత్తం నిర్వీర్యం అయిపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉన్మాదంతో దాడులు చేస్తున్నారని, పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులకు రక్షణే లేకుండా పోయిందని చెప్పారు. ఉన్నత చదవులకు కేంద్రాలైన యూనివర్సిటీల్లో ఆచార్యులపై దౌర్జన్యాలకు దిగి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లలో పాలనా సంస్కరణలు, పేదలను ఆదుకునే కార్యక్రమాలతో దేశంలో రాష్ట్రానికి వచ్చిన పేరు ప్రఖ్యాతులన్నింటినీ దెబ్బతీసి, కేవలం మూడు రోజుల్లోనే హింసాయుత రాష్ట్రంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి, పౌర స్వేచ్ఛకు తీవ్ర భంగం వాటిల్లుతోందని, గవర్నర్ జోక్యం చేసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. హింసాయుత ఘటనల్లో బాధితులైన పార్టీ కార్యకర్తలకు, తన అన్నదమ్ములకు, అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్‌సీపీ తోడుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు.

కేబినెట్ పదవి.. 2 సహాయ శాఖలు!

- టీడీపీకి అంతకంటే ఇచ్చేందుకు సానుకూలంగా లేని బీజేపీ
- మరోసారి పౌర విమానయానమే తీసుకోవాలని సూచన
- కీలక శాఖలు, స్పీకర్ పదవికి నో.. డిప్యూటీ స్పీకరైతే సరే
- జేపీ నడ్డాతో చంద్రబాబు మంతనాలు

సాక్షి, న్యూఢిల్లీ: కొత్తగా కొలువుదీరనున్న ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జేడీయూలు అడుగుతున్నన్ని కేబినెట్ బెర్త్‌లు, కీలక శాఖలు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 16 లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న టీడీపీ కోరుతున్నట్లుగా ఐదు కేబినెట్ పదవులతో పాటు స్పీకర్ పదవి ఇవ్వడం సాధ్యం కాదనే విషయాన్ని బీజేపీ పెద్దలు చంద్రబాబుకు తేల్చి చెప్పినట్లు సమాచారం. టీడీపీకి ఒక కేబినెట్ మంత్రిత్వ శాఖతో పాటు రెండు సహాయక మంత్రి పదవులను ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు ఢిల్లీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శాఖల కేటాయింపుపై చంద్రబాబు శుక్రవారం రెండో దఫా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు ఇతర పెద్దలతో చర్చించినా సానుకూల ఫలితం దక్కలేదని తెలుస్తోంది.

కీలక శాఖలు ఇవ్వలేం..!

కేంద్రంలో ముచ్చటగా మూడోసారి కొలువుదీరనున్న మోదీ ప్రభుత్వంలో కీలకమైన హోం, ఆర్థిక, రక్షణ, రైల్వే, న్యాయ, ఐటీ, రోడ్లు, రహదారుల శాఖలను భాగస్వామ్య పక్షాలకు ఇవ్వకూడదని ఇప్పటికే బీజేపీ పెద్దలు నిరాకరించారు. దీంతో కేంద్ర జలశక్తి శాఖతో పాటు పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, ఐటీ కమ్యూనికేషన్లు, నౌకాయాన శాఖలను టీడీపీ కోరినట్లు తెలిసింది. దీనికి అదనంగా స్పీకర్ పదవి కూడా తమకే ఇవ్వాలని అడిగినట్లు జాతీయ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే బీజేపీ పెద్దలు ఇందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. 2014లో మాదిరిగానే పౌర విమానయాన శాఖతో పాటు సహాయ శాఖల్లో కీలక శాఖలు ఇచ్చేందుకు ఓకే చెప్పినట్లు సమాచారం. ఆ కీలక సహాయ శాఖలు ఆర్థిక లేదా జల శక్తి శాఖ కావచ్చనే ఊహాగానాలు సాగుతున్నాయి. స్పీకర్ పదవి కాకుండా డిప్యూటీ స్పీకర్ పదవిని ఇచ్చేందుకు బీజేపీ పెద్దలు సానుకూలంగా ఉన్నట్లు చెబుతున్నారు. 2019లో ఎన్‌డీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు డిప్యూటీ స్పీకర్ పదవిని అసలు కేటాయించలేదు. కేవలం స్పీకర్‌తోనే లోక్‌సభ వ్యవహారాలను నిర్వహించగా ప్రొటెం స్పీకర్‌లతో సభను నడిపించారు. 2014లో మాత్రం అన్నాడీఎంకేకు చెందిన తంబిదొరై, జార్ఖండ్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత కరియా ముండా డిప్యూటీ స్పీకర్లుగా వ్యవహరించారు.

మోదీతోపాటే ప్రమాణం..!

మంత్రి పదవులు, శాఖలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చంద్రబాబు విడిగా చర్చించారు. ప్రాధాన్యతలను ఆయన దృష్టికి తెచ్చారు. నరేంద్ర మోదీతో పాటు ప్రమాణ స్వీకారం చేసే మంత్రుల్లో తమ పార్టీ వారు కచ్చితంగా ఉండేలా చూడాలని కోరినట్లు తెలిసింది.

ప్రజాస్వామ్యమా? ఆటవిక రాజ్యమా?

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న టీడీపీ దాడులు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వారి ఆస్తులే లక్ష్యంగా విధ్వంసం



టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సొసైటీ అధ్యక్షుడు పిచ్చిరెడ్డి

పోలీసుల సమక్షంలోనే బెదిరింపులు, దాడులు, ఆస్తుల ధ్వంసం

నిస్తేజంగా పోలీసు యంత్రాంగం ; పరోక్షంగా రెచ్చగొడుతున్న చంద్రబాబు

వైసీపీ కవ్వింపులపై టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలంటూ ట్వీట్

తాను ప్రమాణ స్వీకారం చేసేదాకా ఇవి కొనసాగించాలని పరోక్ష సంకేతాలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పూర్వం యుద్ధం ముగిశాక విజయం సాధించిన రాజులు ఓడిపోయిన రాజు రాజ్యంపై పడి విధ్వంసం సృష్టించేవారు. జనావాసాలపై దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవారు. అందినకాడికి దోచుకునేవారు. ప్రజలంతా ఒకచోటుకు చేరి.. మోకరిల్లి శరణుకోరాక కానీ శాంతించే వారు కాదు. ఇప్పుడు రాష్ట్రంలో పరిస్థితి చూస్తుంటే అలాంటి దుస్థితే కనిపిస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణం నుంచి టీడీపీ శ్రేణులు యథేచ్ఛగా విధ్వంసకాండ కొనసాగిస్తున్నాయి. ఎక్కడికక్కడ దాడులకు తెగబడి భయోత్పాతం సృష్టిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ అయినా విజయం సాధించాక తొలుత దృష్టి సారించాల్సింది శాంతి భద్రతల పరిరక్షణపైనే. అందుకు విరుద్ధంగా రాష్ట్రంలో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యం కొనసాగిస్తుండగా... తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మాత్రం వారిని నిలువరించే ప్రయత్నం చేయకుండా... తిరిగి వైసీపీ కవ్వింపుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వైసీపీ కవ్వించినా సంయమనం పాటించాలంటూ ట్వీట్ చేయటం విధ్వంసాలకు మరింత ఊతమిచ్చేదిగా కనిపిస్తోంది. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది... వచ్చామన్న కిక్కుతో ఊరూరా కవ్వింపులకు, దాడులకు తెగబడుతున్నది తెలుగుదేశమే. మూడు రోజులుగా వరుస దాడులు చేస్తున్నా పోలీసులకు పైనుంచి ఆదేశాలుండటంతో చేష్టలుడిగి చూస్తున్నారు తప్ప నిలువరించే ప్రయత్నం చేయటం లేదు. తాను ప్రమాణ స్వీకారం చేసే వరకు ఏమైనా చేయండని, రెచ్చిపోండని చంద్రబాబు పరోక్షంగా సంకేతాలిచ్చారని, అందుకే పోలీసులు పట్టనట్లు ఊరుకుంటున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ఎందుకంటే తాను ప్రమాణ స్వీకారం చేయకముందయితే తన హయాంలో జరగలేదని చెప్పొచ్చనేది బాబు యోచనగా చెబుతున్నారు.

గన్నవరం వద్ద చంద్రబాబు ప్రమాణస్వీకారం

- 12 ఉదయం 11.37 గంటలకు ముహూర్తం
- ప్రధాని మోదీ, పలువురు సీఎంలు వచ్చే అవకాశం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఈ నెల 12న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకు ఆ రోజు ఉదయం 11.37 గంటలకు ముహూర్తం ఖరారు చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ప్రమాణస్వీకార సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీతోపాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయేలోని కీలక నేతలు హాజరవుతారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న ప్రాంతాన్ని ఎంపిక చేశారు.

వర్మపై జనసేన కార్యకర్తల దాడి



జనసేన కార్యకర్తల దాడితో పగిలిన వర్మ కారు అద్దాలు

పిఠాపురం: పిఠాపురం టీడీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మపై జనసేన కార్యకర్తలు దాడికి దిగారు. ఈ ఘటనలో వర్మతో సహా పలువురికి గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో స్థానిక సర్పంచ్‌తో మంతనాలు జరిపేందుకు వర్మ వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఆ గ్రామ జనసేన నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు వచ్చి వర్మను అడ్డుకున్నారు. 'మాకు తెలియకుండా మా గ్రామంలో ఇతర పార్టీల వాళ్లను ఎందుకు కలుస్తున్నారు' అంటూ వర్మను నిలదీశారు. మీకు చెప్పాల్సిన పని లేదంటూ వర్మ వారికి బదులివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన జనసేన నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా ఆయనపై దాడికి దిగారు. రాళ్లు, కొబ్బరి కాయలతో వర్మ కారుపై దాడి చేయడంతో ఆయన కారు అద్దాలు పగిలిపోయాయి. వారి నుంచి తప్పించుకుని ఆయన కారులో వేగంగా వెళ్లిపోయారు. ఎన్నికల్లో పని చేసిన వారికి కృతజ్ఞతలు తెలపడానికి వెళితే జనసేన శ్రేణులు తనపై దాడి చేశాయని టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. అల్లరి మూకలను జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు. జనసేన నేతలు తనను చంపడానికి ప్రయత్నించారని ధ్వజమెత్తారు. 9 నెలలుగా ఉదయ్ తనను వేధిస్తున్నాడని.. జనసేనకు పనిచేయడం తన ఖర్మ అని వ్యాఖ్యానించారు. తనపై హత్యాయత్నం వెనుక ఉదయ్ హస్తం ఉందని ఆరోపించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ



మహేశ్వరి



జనార్దన్



నవీన్

మహబూబ్‌నగర్ క్రీడలు/మాగనూరు/చిన్నచింతకుంట: హన్మకొండలో గురు, శుక్రవారాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన మహేశ్వరి ప్రతిభ కనబరిచింది. మహిళల విభాగంలో మహేశ్వరి 300మీటర్ల స్టిపుల్ చేజ్, 1,500మీటర్ల పరుగులో బంగారు పతకాలు సాధించింది. దనిపై సీనియర్ అథ్లెట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాగనూర్ మండలంలోని కొత్తపల్లికి చెందిన జనార్దన్ బంగారు పతకాన్ని సాధించాడు. హన్మకొండ పట్టణంలో జరిగిన పదో అథ్లెటిక్స్ సౌత్‌జోన్ పోటీలో ఈ బంగారు పతకాన్ని గెలపొందినట్లు డివైఎస్ఓ వెంకటేష్ తెలిపారు.

సీనియర్ కేటగిరిలో చిన్నచింతకుంట మండలం అల్లీపురం చెందిన నవీన్ డెకథ్లాన్ విభాగంలో మొదటి విజేతగా, 110 మీటర్ల హార్డిల్స్ విభాగంలో తృతీయ విజేతగా, 400 మీటర్ల రిలే రన్నింగ్ విభాగంలో ద్వితీయ విజేతగా నిలిచి బంగారు, కాంస్యం, రజితం పతకాలను సాధించాడు.

రామన్‌పాడులో 1,012 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,012 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వకు నీటి సరఫరా నిలిపివేయగా.. సమాంతర కాల్వ ద్వారా 41 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

క్రీడల్లో శిక్షణ ఎలా?



మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియం

మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో కోచ్‌ల కొరత

- కేవలం నలుగురు శిక్షకులతో నెట్టుకొస్తున్న వైనం
- ఆందోళనలో ఔత్సాహిక క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాకే తలమానికమైన మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో కోచ్‌ల కొరత తీరడం లేదు. జిల్లా యువజన, క్రీడాశాఖకు సంబంధించిన ఈ స్టేడియం గతంలో వివిధ క్రీడాంశాల్లో కోచ్‌ల శిక్షణ కార్యక్రమాలతో కళకళలాడేది. ప్రస్తుతం కొందరు కోచ్‌లతోనే నెట్టుకొస్తున్నారు. 18 ఏళ్ల నుంచి స్టేడియంలో కోచ్‌ల కొరత తీవ్రం కావడంతో క్రీడాకారులు ఆందోళనకు గురవుతున్నారు.

నిరాశలో క్రీడాకారులు..

జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ప్రస్తుతం అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, స్విమ్మింగ్ కోచ్‌లు మాత్రమే ఉన్నారు. మిగతా క్రీడలకు కోచ్‌లు లేకపోవడంతో ఔత్సాహిక క్రీడాకారులు నిరాశకు గురవుతున్నారు. కాగా, స్టేడియంలో ఫుట్‌బాల్ ఖేలో ఇండియా సెంటర్ ఉండటంతో ఈ క్రీడలో చిన్నారులు, యువత శిక్షణ పొందుతున్నారు. మిగతా క్రీడలైన కబడ్డీ, హాకీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, బాక్సింగ్ తదితర క్రీడలకు కోచ్‌లు లేకపోవడం క్రీడాకారులను ఆందోళనకు గురిచేస్తోంది. స్టేడియంలో సరిపడా కోచ్‌లను నియమించాలని క్రీడాసంఘాల ప్రతినిధులు రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోంది. ఇదిలా ఉంటే, జిల్లాలోని మిగతా స్టేడియాలలో కనీసం ఒక్క కోచ్‌ను కూడా నియమించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నెరవేరని లక్ష్యం..

క్రీడాకారుల ఆకాంక్ష మేరకు జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో రూ. 7.79 కోట్లతో అధునాతన క్రీడా సౌకర్యాలతో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటుచేశారు. ఇండోర్ స్టేడియంలో రెండు ఫ్లోర్‌లలో టేబుల్ టెన్నిస్ హాల్, బాక్సింగ్ హాల్‌తో పాటు స్టోర్‌రూంలు, క్రీడాకారుల వసతి గదులు నిర్మించారు. ఇండోర్ స్టేడియంలో క్రీడాపోటీలను తిలకించడానికి రెండు వైపులా గ్యాలరీలనులు ఏర్పాటుచేసి, సీట్లు అమర్చారు. స్టేడియం లోపల ఉడెన్ కోర్టులో ఆరు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేశారు. ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా.. ఇప్పటికీ షటిల్, ఇతర ఇండోర్ క్రీడలకు సంబంధించిన కోచ్‌లను నియమించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

కోచ్‌ల నియామకం చేపట్టాలి..



జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంతో పాటు ఇతర స్టేడియాలకు సరిపడా కోచ్‌లు లేకపోవడంతో ఔత్సాహిక క్రీడాకారులకు సరైన శిక్షణ లభించడం లేదు. స్టేడియాలలో కోచ్‌ల నియామకం చేపడితేనే క్రీడాకారులకు మెరుగైన శిక్షణ లభిస్తుంది. ఈవిషయంపై త్వరలో క్రీడాసంఘాలతో కలిసి ప్రజాప్రతినిధులు, శాట్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తాం.

– కురుమూర్తిగౌడ్, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి

త్వరలో నియామకం..



జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, ఎంవీఎస్‌లోని మినీ స్టేడియాలలో కోచ్‌ల నియామకం కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. త్వరలో కోచ్‌ల నియామకం జరిగే అవకాశం ఉంది. కోచ్‌లు వస్తే ఔత్సాహిక క్రీడాకారులకు మెరుగైన క్రీడాశిక్షణ లభిస్తుంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ

కోచ్‌ల నియామకం కోసం ప్రతిపాదనలు..

జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బాక్సింగ్, బ్యాడ్మింటన్.. మెయిన్ స్టేడియంలో ఆర్చరీ, కబడ్డీ, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ కోచ్‌లతో పాటు ఎంవీఎస్ కళాశాల మినీ స్టేడియంలో వాలీబాల్ కోచ్‌లను నియమించాల్సి ఉంది. ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్)కు డీవైఎస్ఓ ప్రతిపాదనలు పంపారు. కోచ్‌లు వస్తే ఔత్సాహిక క్రీడాకారులకు మెరుగైన శిక్షణ లభిస్తుంది. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి, కోచ్‌ల నియామకానికి చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.



మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

ముంగారి సేద్యానికి శ్రీకారం



గట్టు శివారులో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

- నేటి నుంచి మృగశిర కార్తె
- చల్లబడిన వాతావరణం
- పొలం పనుల్లో రైతులు

గట్టు: మృగశిర కార్తె వస్తే చాలు.. రైతుల్లో ఎక్కడ లేని ఆనందం కనిపిస్తుంటుంది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని వానాకాలం ప్రారంభం కావడం మృగశిర కార్తె ప్రత్యేకత. ఇన్నాళ్లు ఎండ వేడిమి, ఉక్కపోతకు తల్లడిల్లిన జనం ఈ కార్తె రాకతో ఊపిరి పీల్చుకుంటారు. విపరీతమైన ఎండల నుంచి చల్లటి వాతావరణంలోకి అడుగిడుతున్న సందర్భంగా శరీరంలో వేడి తగ్గకుండా ఉండేందుకు చాలామంది వేడిచేసే పదార్థాలను కార్తె ప్రారంభం రోజున తీసుకుంటారు. శనివారం ఈ కార్తె ప్రారంభం కానుండటంతో మాంసాహారులు కోళ్లు, గుడ్లను ఆహారంగా తీసుకుంటుండగా.. శాకాహారులు ఇంగువ, బెల్లం తింటారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంప్రదాయం నేటికీ కొనసాగిస్తున్నారు. ఈ కార్తె రాకతో నైరుతి రుతు పవనాలు ప్రవేశిస్తాయి. వ్యవసాయ పనులు జోరందుకునేది ఈ కార్తెలోనే.

సేద్యానికి శ్రీకారం..

వానాకాలం ప్రారంభానికి, మృగశిర కార్తెకు చాలా దగ్గరి సంబంధాలు ఉన్నాయి. ఈ కార్తె రాకతో రుతు పవనాలు ప్రారంభం కావడంతో వర్షాలు కురిసి రైతులు పొలం పనుల్లో బిజీ అవుతారు. విత్తనాలు వేసుకునే సమయం కూడా ఇదే. ముంగారి సేద్యం పనులను అన్నదాతలు కార్తె రాకతో ప్రారంభిస్తారు. రోహిణి కార్తెలో విత్తుకున్న విత్తుకు తిరుగుండదని పెద్దలు చెబుతుంటారు. మృగశిర కార్తెలో విత్తనాలు మొలకెత్తి బాగా పండుతాయనేది రైతుల నమ్మకం. ఇక ఉబ్బసం వ్యాధితో బాధపడే వారికి కూడా మృగశిర కార్తె ప్రారంభం రోజున చేప మందు వేస్తారు. ఇలా వానాకాలం సాగుకు ముందువచ్చే మృగశిరకు ప్రత్యేకత ఉంది.

జూరాలకు 1,588 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జూరాలలో ప్రస్తుత నీటిమట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శుక్రవారం 1,588 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైందని పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో, స్థానికంగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులో నీటిమట్టం కాస్త పెరిగిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రాజెక్టులో 4.027 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ప్రాజెక్టు నుంచి 141 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పెట్రోల్ బంకుల తనిఖీ



పాలమూరు: జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంకులపై వస్తున్న ఫిర్యాదులపై జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ స్పందించారు. శుక్రవారం పలు బంకుల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని లక్ష్మీనర్సింహ పెట్రోల్ బంకు, బృందావన్ పెట్రోల్ బంకు, సఫా పెట్రోల్ బంకులలో డీజిల్, పెట్రోల్ నాణ్యతను పరీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు పెట్రోల్ పంపులు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా సరిచూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి ఏడాది తప్పనిసరిగా పంపులకు వెరిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామన్నారు. పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత, కొలతల్లో అనుమానం వస్తే 90106 51783 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. బంకులలో వినియోగదారులు కోరితే ఐదు లీటర్ల క్యాన్‌లలో పెట్రోల్ డెలవరీ చెక్ చేసి చూపించాలని తెలియజేశారు.